భూ సమస్యలు ప్రభుత్వ సృష్టే

తిరువూరు ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు



తిరువూరు నగర పంచాయతీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు: రెవెన్యూ శాఖలో భూ సంబంధిత సమస్యలు అధికంగా రావడానికి ప్రభుత్వమే కారణమని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం జరిగిన తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నివాస ప్రాంతాలను నిషేధిత జాబితాలో చేర్చిన విషయాన్ని పలువురు కౌన్సిలర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు దీర్ఘకాలంగా సాగు చేసుకుంటూ ప్రభుత్వానికి శిస్తు చెల్లిస్తున్న దేవదాయ శాఖకు సంబంధం లేని భూములను కూడా 22-ఏ లో చేర్చడంలో రెవెన్యూ అధికారుల పాత్ర ఉందని విమర్శించారు. తిరువూరు పట్టణంలో 80 ఎకరాల్లో ఎంతో కాలంగా నివాసం ఉంటున్న కుటుంబాలకు ఇబ్బంది కలిగించే విధంగా నివేశన స్థలాలను నిషేధిత భూముల జాబితాలో చేర్చడంపై తాను ఇప్పటికే రాష్ట్ర రెవెన్యూ మంత్రికి, జిల్లా కలెక్టరుకు తెలియజేశానని, విస్సన్నపేట, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లో కూడా ఇదే సమస్య ఉందని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

లిడ్ క్యాప్ స్థలాల సంరక్షణకు చర్యలు

లిడ్ క్యాప్ రాష్ట్ర చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు



వెల్లటూరులో లెదర్ పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న మాణిక్యాలరావు, తదితరులు

జి.కొండూరు: రాష్ట్రంలో అన్యాక్రాంతమైన లిడ్ క్యాప్ స్థలాల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నామని లిడ్ క్యాప్ రాష్ట్ర చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు అన్నారు. జి.కొండూరు మండల పరిధి వెల్లటూరు గ్రామ శివారులో మినీ లెదర్ పార్కుకు కేటాయించిన స్థలాన్ని మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వెల్లటూరులో మినీ లెదర్ పార్కు కోసం కేటాయించిన 18 ఎకరాల స్థలంలో ఆక్రమణలు పోగా ఒక ఎకరం మాత్రమే మిగిలిందన్నారు. వెల్లటూరుతో పాటు రాష్ట్రంలో లిడ్ క్యాప్ స్థలాలను ఆక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అతి త్వరలో వెల్లటూరులో మినీ లెదర్ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. టీడీపీ నాయకుడు పచ్చిగోళ్ల బాలకృష్ణ, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు బట్టపర్తి రాజు, పరసా రామయ్య, చాట్ల వీరాస్వామి పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



మైలవరం: పుస్తకాలను ప్రేమిస్తే అవి మీ జీవితాల్లో వెలుగులు నింపుతాయని ఎంఎస్ఆర్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ముప్పిడి నాగేశ్వరరెడ్డి అన్నారు. రెడ్డిగూడెం మండలం కూనపురాజుపర్వ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను మంగళవారం పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్బీఆర్సీఈ అధ్యాపకునికి పీహెచ్‌డీ ప్రదానం



మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ అధ్యాపకుడు శీలం రామిరెడ్డికి పీహెచ్‌డీ ప్రదానం చేశారు. ఎన్ఐటీ పాట్నాలో మెకానికల్ విభాగంలో చేసిన పరిశోధనకు గాను ఆయనకు పీహెచ్‌డీ లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా రామిరెడ్డిని కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

వ్యవసాయ భూములకు సరిహద్దులు నిర్ణయించాలి



రాయనపాడు(విజయవాడరూరల్): రాయనపాడు గ్రామంలో వ్యవసాయ భూములకు సర్వే నంబర్ల ప్రకారం సరిహద్దులు నిర్ణయించాలని పలువురు రైతులు తహసీల్దార్ బి.సుగుణకు విజ్ఞప్తి చేశారు. రాయనపాడు పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు మంగళవారం జరిగింది. గతంలో జరిగిన రీ సర్వేలో అనేక పొరబాట్లు చోటుచేసుకున్నాయని, వాటిని సరిచేయాలని పలువురు రైతులు అర్జీలను అందజేశారు. రైతులు, అధికారులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మైలవరం: మైలవరం శ్రీ లీలావతి గిరిజన పాఠశాలలో నూతన సంవత్సర పాఠశాల క్యాలెండర్‌ను ఆదర్శ రైతు గంజి శివరామిరెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సమయ పాలన పాటించిన ప్రతి వ్యక్తి విజయం సాధిస్తాడన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ, విద్యా సంస్థ కార్యదర్శి జె. రాధాకుమారి పాల్గొన్నారు.

● **విస్సన్నపేట:** కృష్ణా మిల్క్ యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం విస్సన్నపేటలో ఆవిష్కరించారు. పాల ఉత్పత్తిదారులకు తమ యూనియన్ అందిస్తున్న సేవలను జిల్లా బోర్డు డైరెక్టర్ నెక్కలపు వాణిశ్రీ వివరించారు. రైతులు యూనియన్‌కు అండగా నిలవాలని, పాల ఉత్పత్తి పెంపునకు సహకరించాలని కోరారు. తిరువూరు క్లస్టర్ మేనేజరు సాంబశివమూర్తి, సూపర్‌వైజర్ శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

నూజివీడు: పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి సకాలంలో హాజరుకావడంలో అలసత్వం వహించిన ముగ్గురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ మంగళవారం తెలిపారు. పాతరావిచర్ల గ్రామ సర్వేయర్, పల్లెర్లమూడి ఏఎన్ఎం, గొల్లపల్లి అంగన్‌వాడీ కార్యకర్తలు పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఉదయం ఎనిమిది గంటల వరకు హాజరుకాలేదు. షోకాజ్ నోటీసు అందిన మూడు రోజుల్లోగా లిఖిత పూర్వకంగా సమాధానం చెప్పాలని నోటీసులో పేర్కొన్నట్లు తెలిపారు.

మైలవరంలో న్యాయవాదుల విధుల బహిష్కరణ



మైలవరం: న్యాయవాది మృతికి కారణమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని మైలవరం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీ ప్రసాద్, వీటీ కిశోర్ డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా అనంతపురం పట్టణ మూడో పోలీస్ స్టేషన్‌లో సీఐ రూంలో సీనియర్ న్యాయవాది బీవీ శేషాద్రి మరణం, కడప జిల్లా రాయచోటిలో జై సుదర్శన్‌రెడ్డిపై పోలీసుల దాడులు, పొన్నూరు పట్టణంలో దళిత న్యాయవాది భేతాళ ప్రకాష్‌కుమార్‌పై ఎస్ఐ దాడి చేయడాన్ని నిరసిస్తూ మైలవరం బార్ అసోసియేషన్ న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. అనంతపురం మూడో పోలీస్ స్టేషన్ సీఐ, కడప జిల్లా రాయచోటి పోలీస్ స్టేషన్ ఎస్ఐ, పొన్నూరు పట్టణ ఎస్ఐలను తక్షణమే విధుల నుంచి తప్పించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మైలవరం బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాదులు పీవీ శేషగిరిరావు, ఎస్‌వీకే సత్యనారాయణరావు, పజ్జూరు రామకృష్ణ, ఓర్సు శ్రీనివాసరావు, ముల్లంగి రవికుమార్, రావూరి రమేష్‌బాబు, ఎం. శరత్‌బాబు, ఎం. తనూజ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాసోత్సవాలు



గంపలగూడెం: ధనుర్మాసం 16వ రోజు కార్యక్రమాలను మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం వైభవంగా నిర్వహించారు. గంపలగూడెం సీతారామ చంద్రస్వామి ఆలయంలో పులిహోర, పండ్లు, డ్రై ఫ్రూట్స్‌తో వెంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవి ఆకారంలో చిత్రీకరించిన చిత్రాలు అబ్బురపరిచాయి. సీతారామచంద్రులు, గోదాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. తిరుప్పావై పఠనం, దీపోత్సవం నిర్వహించారు. గంపలగూడెం భజన మందిరం, పెనుగొలను, ఊటుకూరు రామాలయాల్లో నిర్వహించిన ధనుర్మాస గోష్టిలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం పంపిణీ



విస్సన్నపేట: విస్సన్నపేట పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు మంగళవారం యూనిఫాం పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి, సర్పంచి సాదుపాటి నాగమల్లేశ్వరి, ఉప సర్పంచి సత్యనారాయణరెడ్డి యూనిఫాం అందజేశారు. ఎంపీడీఓ రాట్నాలు, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన బస్సులు ప్రారంభం



ఇబ్రహీంపట్నం: స్థానిక ఆర్టీసీ బస్ డిపో నుంచి విశాఖపట్నం, తిరుపతికి రెండు నూతన సూపర్ లగ్జరీ బస్సులను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. ఇప్పటికే ఆయా ప్రాంతాలకు రెండు బస్సులు నడుస్తుండగా ప్రయాణికుల సౌకర్యార్థం ఆ రూట్లలో నూతన బస్సులను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం అమలుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. డిపో మేనేజర్ ఎ.వేణు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

2 వేల లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



విస్సన్నపేట: విస్సన్నపేట మండలం చంద్రుపట్ల తండాలో సారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. సారా తయారీ నిమిత్తం నేలలో పాతిపెట్టిన డ్రమ్ముల్లో నిల్వ చేసిన రెండు వేల లీటర్ల బెల్లపు ఊటను పొక్లెయిన్‌తో బయటకు తీసి ధ్వంసం చేశారు. తిరువూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె. శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడిలో పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందాలి



ఆగిరిపల్లి: ప్రధానోపాధ్యాయులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవడం ద్వారా లక్ష్యాలను సాధించవచ్చని ఏలూరు జిల్లా ఏఎంఓ రామారావు అన్నారు. మండలంలోని తోటపల్లి హీల్ పాఠశాల ఆవరణలో మండల విద్యా శాఖాధికారులకు, ప్రధానోపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఆరో విడత స్కూల్ లీడర్ షిప్ శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఉపాధ్యాయుల తరపున రూ.లక్ష విరాళాన్ని హీల్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేరు సత్యప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా ఏఎంఓ శ్యామసుందరరావు, రిసోర్స్‌పర్సన్లు విజయ్, కృష్ణమోహన్, హీల్ సీఈఓ కూరపాటి అజయ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థిని వైద్య చికిత్సకు రూ.12 లక్షల మంజూరు

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీ ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఎం.అనూషకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ కింద రూ.12 లక్షలు మంజూరయ్యాయని ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్ తెలిపారు. డిసెంబర్ 19న బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవడంతో అనూష విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు అత్యవసరంగా శస్త్రచికిత్స చేయాల్సి రావడంతో ఖర్చుల కోసం అవసరమైన మొత్తాన్ని ట్రిపుల్ ఐటీ విద్యార్థులు, అధ్యాపకులు ఏర్పాటు చేశారు. తదుపరి చికిత్స కోసం ట్రిపుల్ ఐటీ అధికారులు ప్రభుత్వాన్ని సంప్రదించగా సీఎంఆర్ఎఫ్ కింద రూ. 12 లక్షలు మంజూరయ్యాయి.

3న హుండీ కానుకల లెక్కింపు

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల మారెమ్మ అమ్మవారి దేవాలయంలో భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకలను జనవరి 3న లెక్కిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి వీడీడీ ప్రసాద్ తెలిపారు. దేవదాయ శాఖాధికారుల పర్యవేక్షణలో ఉదయం 10.30 గంటలకు లెక్కింపు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు.

న్యూ ఇయర్ సందడి



నూజివీడు చిన్న గాంధీబొమ్మ సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న యువత



నూజివీడు పట్టణంలో ప్రజలతో రద్దీగా మారిన రోడ్డు

నూజివీడు: నూజివీడు, తిరువూరు, మైలవరం నియోజక వర్గాల్లో నూతన సంవత్సర సందడి నెలకొంది. మంగళవారం సాయంత్రం నుంచి రోడ్లన్నీ జన సంచారంతో రద్దీగా మారాయి. దుకాణాలు కిక్కిరిసి పోయాయి. బట్టల దుకాణాలు, పూల దుకాణాలు, కేక్ దుకాణాలు, స్వీట్ షాపుల్లో రద్దీ కనిపించింది. యువకులు కేరింతలు కొడుతూ రోడ్లపై బైక్‌లతో విన్యాసాలు చేశారు. ఇళ్ల ముందు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకులూ రంగవల్లులు తీర్చిదిద్దారు. యువతీ, యువకుల కేరింతలు.. మందుబాబుల చిందులు..చిన్న పిల్లల ఆనందోత్సాహాల నడుమ పట్టణ ప్రజలు మంగళవారం అర్ధరాత్రి పాత సంవత్సరం 2024కి గుడ్‌బై చెబుతూ, నూతన సంవత్సరం 2025కి ఆహ్వానం పలికారు. గత సంవత్సరపు చేదు జ్ఞాపకాలను వదిలి నూతన సంవత్సరపు ఆశల హరివిల్లుకు స్వాగతం చెప్పారు. గ్రామాల్లో సైతం అర్ధరాత్రి వరకు యువకుల సందడి కనిపించింది. క్రైస్తవులు తెల్లవారు జాము వరకు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



నూజివీడులో జనంతో రద్దీగా ఉన్న వస్త్ర దుకాణం



ఆగిరిపల్లిలో స్వీట్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు



నూజివీడులో పూల దుకాణం వద్ద రద్దీ

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



నూజివీడు: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ అన్నారు. నూజివీడు మండలం రామన్నగూడెంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు, సర్వే, పట్టాదారు పాసు పుస్తకాల జారీ తదితర సమస్యలపై భూ యజమానులు అర్జీలను ఇవ్వొచ్చన్నారు. ఈ సదస్సులో వచ్చిన అర్జీలను సిబ్బంది త్వరితగతిన పరిష్కరిస్తారని చెప్పారు. గ్రామంలోని శ్మశానం ఆక్రమణకు గురైందని, అలాగే వాగు ఆక్రమణకు గురైందని, దీని వల్ల ఇబ్బందులు పడుతున్నామని, ఆక్రమణలను తొలగించాలని కోరుతూ గ్రామానికి చెందిన తంబి అర్జీని అందజేశారు. రెవెన్యూ సదస్సులో తొమ్మిది అర్జీలు వచ్చాయి. డెప్యూటీ తహసీల్దార్ రవికిరణ్ సింగ్, వీఆర్వో పద్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

- మూలపాడు(ఇబ్రహీంపట్నం): రెవెన్యూ సదస్సుల్లో గ్రామాల్లోని భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు తెలిపారు. మూలపాడులో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమస్యలపై తగిన ఆధారాలతో అర్జీలు పెట్టుకోవాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న అర్జీలు పరిష్కారం కావన్నారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.

ప్రతి ఇంటికీ పోస్టల్ పొదుపు ఖాతా లక్ష్యం

గుడివాడ డివిజన్ పోస్టల్ ఎస్పీ చల్లా అప్పారావు



మాట్లాడుతున్న పోస్టల్ ఎస్పీ చల్లా అప్పారావు

నూజివీడు: ప్రతి ఇంటికీ పోస్టల్ పొదుపు ఖాతా, ప్రతి ఒక్కరికి పోస్టల్ బీమా కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని గుడివాడ డివిజన్ పోస్టల్ ఎస్పీ చల్లా అప్పారావు అన్నారు. పట్టణంలోని సబ్ పోస్టాఫీసు ఆవరణలో మంగళవారం పోస్టల్ ఖాతాలు, బీమా ప్రీమియం ఎక్కువగా చేయించిన సిబ్బంది అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని పోస్టాఫీసుల్లో ఇండియన్ పోస్టు పేమెంట్ బ్యాంకు ద్వారా ప్రజలకు బ్యాంకింగ్ సేవలను అందిస్తున్నామన్నారు. ఎవరైతే ఇప్పటికే ఉన్న బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్ కాలేదో వారు పోస్టాఫీసులో ఖాతాలు ప్రారంభించవచ్చని చెప్పారు. గుడివాడ పోస్టల్ డివిజన్ పరిధిలో 40 వేల ఖాతాలను తెరిచామన్నారు. అలాగే పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో డివిజన్‌లో ఏడు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, అందులో ఒకటి నూజివీడులో ఉందని చెప్పారు. గుడివాడ, నూజివీడుల్లో పోస్టల్ ఏటీఎంలు కూడా ఉన్నాయన్నారు. పోస్టల్ శాఖ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఉత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నూజివీడు పోస్టల్ ఏఎస్పీ బి.షణ్ముఖరావు, ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంకు మేనేజర్ గణేష్, సబ్ పోస్టుమాస్టర్ ఇండ్ల బుచ్చియ్య, అసిస్టెంట్ పోస్టుమాస్టర్ బీవీ కృష్ణారావు, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.కర్ణ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం పరిశీలన..

స్థానిక బ్యాంక్ స్ట్రీట్‌లోని సబ్ పోస్టాఫీసు ఆవరణలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని గుడివాడ డివిజన్ పోస్టల్ ఎస్పీ చల్లా అప్పారావు మంగళవారం సందర్శించారు. ఆధార్ కేంద్రం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఆధార్ కేంద్రం నిర్వాహకురాలికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ఇక్కడ ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, దీని ద్వారా బాల ఆధార్, ఆధార్‌కార్డులో అడ్రస్ మార్పు, బయోమెట్రిక్ అప్‌డేట్ తదితర సేవలను అందిస్తారన్నారు. నూజివీడు పోస్టల్ ఏఎస్పీ బి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం ఏజెన్సీపై ఎస్‌ఎంసీ చైర్మన్ కన్ను

- తప్పుకోవాలంటూ ప్రస్తుత నిర్వాహకులపై ఒత్తిడి
- వ్యతిరేకిస్తున్న యూనియన్ నాయకులు

నూజివీడు: పట్టణంలోని ఓ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహిస్తున్న ఏజెన్సీ నిర్వాహకులను తప్పుకోవాలంటూ ఇటీవల కొత్తగా ఎన్నికైన పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారు. చైర్మన్‌గా ఎన్నికైన వెంటనే ఎలాగైనా భోజన ఏజెన్సీని లాక్కోవాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుత ఏజెన్సీ నిర్వాహకులు గత 12 ఏళ్లకు పైగా హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీని నిర్వహిస్తున్నారు. భోజన పథకం నిర్వహణపై విద్యార్థుల నుంచి గానీ, వారి తల్లిదండ్రుల నుంచి గానీ, ఉపాధ్యాయుల నుంచి గాని ఇప్పటివరకు ఎలాంటి అభ్యంతరాలు రాలేదు. అయితే ఎస్‌ఎంసీ చైర్మన్ కన్ను ఏజెన్సీపై ఎందుకు పడిందో గాని ఎలాగైనా కైవసం చేసుకోవాలని రకరకాల ప్రయత్నాలు చేస్తున్నట్లు హైస్కూల్‌లో ఉపాధ్యాయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఏజెన్సీ నిర్వాహకులు లొంగడం లేదని వారికి డబ్బులు చెల్లించేందుకు సైతం ఎస్‌ఎంసీ చైర్మన్ వారితో బేరాలకు దిగడం గమనార్హం. మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వహణ నుంచి తప్పుకుంటే లక్ష రూపాయల నుంచి ప్రారంభించి రూ.3 లక్షల వరకు చెల్లిస్తానని బేరాలు సైతం ఆడారు. అయినప్పటికీ ఏజెన్సీ నిర్వాహకులు లొంగకపోవడంతో ఎలాగైనా తప్పించాలని విశ్వప్రయత్నాలు చేస్తూ ఎవరెవరినో వంట చేసే సమయంలో పంపుతూ వేధిస్తుండటం గమనార్హం. ఈ వ్యవహారమంతా ఏఐఎస్‌ఎఫ్, మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకుల యూనియన్ నాయకులకు తెలిసి ఏజెన్సీ నిర్వాహకుల జోలికి వస్తే ఊరుకునేది లేదని, పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించినట్లు సమాచారం. అంతే కాకుండా ఏజెన్సీ నిర్వాహకులపై తప్పుకోమని ఒత్తిడి చేయడం, వేధించడం వంటి చర్యలను ఆపాలని విద్యార్థులతో కలిసి రెండు, మూడు రోజుల్లో ఆందోళన చేయాలని సన్నాహాలు చేస్తున్నారు. లోటుపాట్లు ఉంటేనో, భోజనం సరిగా వండి పెట్టకపోతేనో చర్యలు తీసుకోవాలే గాని, భోజన పథకంపై కన్నేసి దాని నుంచి దోపిడీ చేయాలనే లక్ష్యంతో కొన్నేళ్లుగా పనిచేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులను తొలగించాలని చూస్తే ఊరుకునేది లేదని యూనియన్ల నాయకులు పేర్కొంటున్నారు.

జోగి రమేష్ న్యూ ఇయర్ శుభాకాంక్షలు



ఇబ్రహీంపట్నం: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ జోగి రమేష్ మంగళవారం రాత్రి రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2025 ఏడాది ప్రతి ఇంటా సుఖ శాంతులు వెల్లి విరియాలని ఆకాంక్షించారు. గత 2024 స్మృతులకు వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి ఆహ్వానం పలకాలని కోరారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభపై ప్రచార జాతా



ముసునూరు: యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు జి.పద్మకిశోర్, జి.రాంబాబు పిలుపునిచ్చారు. జనవరి 5, 6, 7, 8 తేదీల్లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరుగనున్న కాకినాడ విద్యా వైజ్ఞానిక మహాసభకు ఉపాధ్యాయులు భారీగా తరలి రావాలని కోరుతూ మంగళవారం రమణక్కపేటలో ప్రచారజాతా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నేతలు ముస్తాఫ్ ఆలీ, రుద్రాక్ష రవి కుమార్ సుభాషిణి, శ్యాంబాబు, జి.వెంకటేశ్వరరావు, గాంగేయుడు తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణపై వివాదం

నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల వాగ్వాదం



కౌన్సిల్ సమావేశంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల వాగ్వివాదం

తిరువూరు: పురపాలక శాఖ రూపొందించిన విధంగా తిరువూరు మెయిన్ రోడ్డును 100 అడుగుల వెడల్పు చేయాలనే ప్రతిపాదనపై నగర పంచాయతీ కౌన్సిలర్ల నడుమ వాగ్వివాదం జరిగింది. మంగళవారం చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో మెయిన్ రోడ్డు విస్తరణ అంశంపై తెలుగుదేశం, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. గతంలోనే పురపాలక శాఖ ఈ ప్రతిపాదన పంపినందున 60 అడుగుల వెడల్పు చేసేందుకే అవకాశం ఉందని నగర పంచాయతీ కౌన్సిల్ తీర్మానం చేసి పంపాలని పలువురు కౌన్సిలర్లు సూచించారు. మాస్టర్ ప్లాన్ మార్పు విషయంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వివాదం నెలకొంది. తిరువూరులో తాగునీటి సమస్య పరిష్కారానికి ఇబ్రహీంపట్నం ఫెర్రీ నుంచి కృష్ణా నదీ జలాలను సరఫరా చేసే పైలట్ ప్రాజెక్టు ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై చర్చించాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కౌన్సిలర్లను కోరారు. సుమారు రూ.200 కోట్లతో ఈ ప్రాజెక్టును అమలు చేసిన అనంతరం ప్రతి సంవత్సరం రూ.8 కోట్ల వరకు కరెంటు బిల్లు, నిర్వహణా వ్యయం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇందుకు నగర పంచాయతీ ఆర్థిక పరిస్థితి పరిశీలించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ ప్రాజెక్టుకు ప్రత్యామ్నాయం కూడా పరిశీలించాలన్నారు. ఈ విషయమై ప్రజల అభిప్రాయాలను కూడా తెలుసుకోవాలని చెప్పారు. నగర పంచాయతీ స్టాండింగ్ కౌన్సిల్‌కు న్యాయవాది అంకిరెడ్డి అంజన్‌రెడ్డిని నియమిస్తూ తీర్మానించారు. కూరగాయల దుకాణంలో ఖాళీ షాపులకు వేలంపాట నిర్వహించాలని, వచ్చే వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ట్యాంకర్ల ద్వారా మంచి నీరందించేందుకు రూ.6.30 లక్షలు కేటాయించాలని తీర్మానించారు. 15వ ఆర్థిక సంఘం నుంచి తిరువూరు నగర పంచాయతీకి రెండు విడతల్లో మంజూరు చేసిన రూ.1.50 కోట్లను అమృత్ 2 పథకం అమలు నిమిత్తం పురపాలక శాఖకు తిరిగి పంపాలని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులకు ఆమోదం తెలుపుతూ తీర్మానించారు. పట్టణంలో కోతులు, కుక్కల బెడద నివారించాలని పలువురు కౌన్సిలర్లు కోరారు. కమిషనర్ లోవరాజు, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, కౌన్సిలర్లు తంగిరాల వెంకట రెడ్డి, పరసా శ్రీనివాసరావు, షేక్ హుస్సేన్, నాళ్లా సురేంద్ర, పసుపులేటి శేఖర్‌బాబు, ఏరువ ప్రకాష్ రెడ్డి, నదియా, మూడు దుర్గా, మోదుగు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ల పంపిణీ



చాట్రాయి: ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడుపుతున్నామని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సోమవరం, చాట్రాయి గ్రామాల్లో మంగళవారం లబ్ధిదారులకు పింఛను సొమ్మును అందజేశారు. ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ డి.ప్రశాంతి, పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి, సర్పంచ్ శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

- మూలపాడు(ఇబ్రహీంపట్నం): మండల పరిధిలోని మూలపాడు గ్రామంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి లబ్ధిదారులకు పింఛన్ల నగదు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక నుంచి పింఛన్ తీసుకునే భర్త మరణిస్తే మరుసటి నెల నుంచి భార్యకు పింఛన్ అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. మూడు నెలలకు ఒకసారి పింఛన్ తీసుకునేందుకు కూడా వెసులుబాటు కల్పించిందని చెప్పారు. ఎంపీడీఓ సునీతశర్మ, ఎంపీటీసీ గొట్టిముక్కల రాధ, ఈఓపీఆర్డీ మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- తిరువూరు: తిరువూరు మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ 95 శాతం పూర్తయిందని ఎంపీడీఓ రవిబాబు అన్నారు. మండలంలో 6,759 మంది పెన్షనర్లుండగా 6,473 మందికి మంగళవారం పెన్షను సొమ్మును పంపిణీ చేశారని చెప్పారు.

వజ్రోత్సవాలకు గొల్లపల్లి హైస్కూల్ ముస్తాబు

- పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో ఏర్పాట్లు
- 12న వజ్రోత్సవాల నిర్వహణ



వజ్రోత్సవాలకు ముస్తాబవుతున్న అన్నే రామకృష్ణయ్య జెడ్పీ హైస్కూల్

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి శ్రీ అన్నే రామకృష్ణయ్య జెడ్పీ హైస్కూల్ వజ్రోత్సవాలకు ముస్తాబవుతోంది. 1950లో స్థాపించిన ఈ పాఠశాల 2025 నాటికి 75 ఏళ్ల పూర్తి చేసుకుంటున్న సందర్భంగా పూర్వ విద్యార్థులు వజ్రోత్సవాల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. గ్రామానికి చెందిన అన్నే రామకృష్ణయ్య, మనోహరమ్మ దంపతులు విరాళంగా ఇచ్చిన ఐదు ఎకరాల పొలం, భవన నిర్మాణానికి ఆనాడు వారు అందజేసిన రూ.10,000లతో అప్పటి జిల్లా బోర్డు చైర్మన్ దివంగత కాకాని వెంకటరత్నం ప్రోత్సాహంతో గొల్లపల్లిలో హైస్కూల్‌ను ఏర్పాటు చేశారు. పరిసర గ్రామాలైన మీర్జాపురం, కొత్తపల్లి, మల్లవల్లి, బిళ్లనపల్లి, మర్రిబంధం, సీతారామపురం, మొర్సపూడి, పోలసానపల్లి, వట్టిగుడిపాడు, దేవరగుంట, జంగంగూడెం తదితర గ్రామాల విద్యార్థులు ఈ పాఠశాలకు వచ్చి చదువుకునేవారు. ప్రారంభంలో తాత్కాలికంగా గొల్లపల్లి జమీందారు ఆవరణలో 6, 7, 8 తరగతులతో ప్రారంభమైన ఈ పాఠశాల కాలక్రమేణా భవనాలను నిర్మించడంతో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు అందుబాటులోకి వచ్చాయి. ఈ పాఠశాల విద్యార్థులు ఎందరో ఉన్నత స్థానాలను అధిరోహించారు. ప్రస్తుతం హైస్కూల్‌లో 300 మంది విద్యార్థులు ఉండగా హైస్కూల్ వజ్రోత్సవాలను జనవరి 12న ఘనంగా నిర్వహించేందుకు పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో ఏర్పాట్లు చేస్తున్నారు. 1950 నుంచి ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఈ వేడుకలకు హాజరుకావాలని, ఈ సందర్భంగా నిర్వహించే పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనాలని నిర్వహణ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం పలువురు చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. విజయవాడ గొల్లపూడిలోని కామకోటినగర్‌కు చెందిన సంప్రదాయ పాఠశాలకు చెందిన పలువురు చిన్నారులు భక్తి సంగీతాన్ని ఆలపించారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయిని వి.పద్మావతి పర్యవేక్షణలో 89 మంది చిన్నారులు అమ్మవారి కీర్తనలను, భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం విశాఖపట్నానికి చెందిన ఆర్యన్ నృత్య కళామందిర్‌కు చెందిన సాహితీ రుక్మేందర్ శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చింది. 10 మంది చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం చిన్నారులకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించడంతో పాటు ప్రసాదాలను అందజేశారు.

వికసిత్ భారత్‌లో భాగస్వాములు కావాలి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజన్ అయిన వికసిత్ భారత్–2047లో విద్యార్థులు, యువత భాగస్వాములు కావాలని విజ్ఞాన భారతి అధ్యక్షుడు డాక్టర్ రమేష్ చెప్పారు. స్థానిక స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాల ఆవరణలో కౌశల్–2024 రాష్ట్ర స్థాయి పోటీలు మంగళవారం జరిగాయి. ఈ పోటీలను రమేష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు భారతీయ విజ్ఞానం పట్ల నిబద్ధతను పెంపొందించేందుకు కౌశల్ ప్రతిభా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మన దేశానికి గొప్ప శాస్త్రవేత్తలను అందించే దిశగా కౌశల్ ప్రతిభా పోటీలను 2018 సంవత్సరం నుంచి విజ్ఞాన భారతి నిర్వహిస్తోందని చెప్పారు. విజ్ఞాన భారతి జాతీయ కార్యదర్శి కొంపెల్ల సుబ్బరాయశాస్త్రి మాట్లాడుతూ వివేకం లేని వ్యక్తి దగ్గర విజ్ఞానం ఉంటే వినాశనానికి దారితీస్తోందన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాల డైరెక్టర్ ఎస్.రమేష్, రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్స్ కమిటీ సమీక్ష సమావేశం

పటమట(విజయవాడతూర్పు): టీడీఆర్(ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్) కోసం వచ్చిన దరఖాస్తులను టీడీఆర్ కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే మంజూరు చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర చెప్పారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో మంగళవారం టీడీఆర్ స్క్రూటినీ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రధానంగా సర్కిల్ -1 పరిధిలోని భవానీపురం పున్నమి ఘాట్ వద్ద గల ప్రాంతం, ఆంధ్రప్రభ కాలనీ రోడ్డు విస్తరణ, డోర్నకల్ రోడ్డు విస్తరణ, కార్ల్‌మార్క్స్ రోడ్డు విస్తరణ, సర్కిల్–3 పరిధిలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఆటోనగర్ చెక్ పోస్టు రోడ్డు విస్తరణ వంటి అంశాలపై చర్చించారు. టీడీఆర్‌ల కోసం ఆన్‌లైన్‌లో వచ్చిన 14 దరఖాస్తుల డాక్యుమెంట్లు, రికార్డులు, ప్రభుత్వ అనుమతులను పరిశీలించారు. సమావేశంలో నార్త్ తహసీల్దార్ సూర్యారావు, వీఎంసీ డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) జి.సృజన, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ గుణదల నందేశ్వరరావు, వీఎంసీ డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రాంబాబు, మోహన్ బాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.